కడిగిన ముత్యం.. కవిత

కవిత నివాసం వద్ద పటాకులు కాల్చి సంబురాలు జరుపుకొంటున్న బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు

ఆర్టీసీ క్రాస్ రోడ్‌లో స్వీట్లు తినిపించుకుంటున్న బీఆర్ఎస్ శ్రేణులు

తెలంగాణ భవన్‌లో మన్నె గోవర్ధన్ రెడ్డికి మిఠాయి తినిపిస్తున్న కార్పొరేటర్ కవితారెడ్డి

ఆర్టీసీ క్రాస్ రోడ్‌లో నృత్యం చేస్తున్న బీఆర్ఎస్ అభిమానులు

సుప్రీం తీర్పుతో న్యాయమే గెలిచింది

● కవిత బెయిల్ మంజూరుపై బీఆర్ఎస్ నేతల హర్షం

నాంపల్లి కోర్టులు, ఆగస్టు 27(నమస్తే తెలంగాణ): ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో ఈడీ, సీబీఐ తరఫున ఢిల్లీ ఎక్సైజ్ అధికారులు నమోదు చేసిన కేసులో భారతీయ రాష్ట్ర సమితి ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు సుప్రీం కోర్టులో బెయిల్ మంజూరు చేయడంతో న్యాయం గెలిచిందని, నాంపల్లి కోర్టుల్లో న్యాయవాదులు మంగళవారం హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా న్యాయవాదులు స్వీట్లను పంపిణీ చేసి, ఒకరికొకరు తినిపించుకున్నారు. ఈ సందర్భంగా బీసీ కమిషన్ సభ్యులు ఉపేందర్, ఫుడ్ కమిషన్ సభ్యులు గోవర్ధన్‌రెడ్డి ఆనందాన్ని పంచుకున్నారు. వారు మీడియాతో మాట్లాడుతూ, ఐదు నెలలుగా రిమాండ్ ఖైదీగా జైలులో కొనసాగిన ధీర వనితగా కొనియాడారు. మొక్కవోని ఆత్మ విశ్వాసంతో ఆశావహ దృక్పథంతో ఆమె పోరాట పటిమను ప్రదర్శించారని, ఆమెపై తప్పుడు కేసులు బనాయించి కేంద్ర ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడిందని ఆరోపించారు. రాజకీయ కుట్రలు పటాపంచలైపోయాయని, చివరకు ధర్మమే గెలిచినట్టు సుప్రీం తీర్పుతో రుజువైందన్నారు. ఢిల్లీ లిక్కర్ స్కాం ఆరోపణల్లో ఎలాంటి నిజాలు లేవని తేలిపోయిందన్నారు. దేశ రాజకీయాల్లో చిరస్థాయిగా ఎమ్మెల్సీ కవిత నిలిచిపోయారని, మహిళా శక్తి మరోసారి జయభేరి మ్రోగించిందని కొనియాడారు. బీఆర్ఎస్ రాష్ట్ర లీగల్ సెల్ సభ్యులు లక్ష్మణ్ గంగాతో పాటు ఇతర న్యాయవాదులు సంతోషం వ్యక్తం చేశారు. రాజీవ్‌గాంధీ విమానాశ్రయం నుంచి ఆమెకు ఆహ్వానం పలికేందుకు అధిక సంఖ్యలో న్యాయవాదులు పాల్గొనేందుకు సిద్ధమవుతున్నారు.

న్యాయమే గెలిచింది..

ఎమ్మెల్సీ కవితది రాజకీయ ప్రేరేపిత అరెస్ట్. గత కొంత కాలంగా బెయిల్ రాకుండా ఈడీ ఇబ్బందులకు గురి చేసింది. ఆమె ఎలాంటి తప్పు చేయలేదు. కాస్త ఆలస్యం జరిగినప్పటికీ న్యాయమే గెలుస్తుందని సుప్రీం కోర్టు మంగళవారం వెలువరిచిన తీర్పుతో స్పష్టమైంది. భవిష్యత్తులో కవిత మరింత దూకుడుగా ప్రజా సేవలో ముందుకు సాగుతుంది.

– ఎమ్మెల్సీ వాణీదేవి

బెయిల్ మంజూరుపై న్యాయవాదుల హర్షం

రంగారెడ్డి జిల్లా కోర్టులు, ఆగస్టు 27(నమస్తే తెలంగాణ): ఢిల్లీ మద్యం కేసులో అక్రమంగా అరెస్ట్ చేసిన ఎమ్మెల్సీ కవితకు సుప్రీం కోర్టు బెయిల్ మంజూరు చేయడంతో న్యాయవాదులు స్వీట్లు పంపిణీ చేసి ఆనందం వ్యక్తం చేశారు. గత 166 రోజులుగా రాజకీయ ప్రేరణతో తప్పుడు కేసులు నమోదు చేసిన కేంద్ర దర్యాప్తు సంస్థలైన సీబీఐ, ఈడీలు అరెస్ట్ చేయడాన్ని వారు తప్పుబట్టారు. తెలంగాణ ప్రజల సంస్కృతి సంప్రదాయాలను విశ్వవ్యాప్తం చేసిన కవిత తిరిగి ప్రజాక్షేత్రంలో సమస్యలపై పోరాడుతుందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ లీగల్ సెల్ నాయకులు కొంతం గోవర్ధన్ రెడ్డి, సీహెచ్ ఉపేంద్ర, పులి గారి గోవర్ధన్ రెడ్డి, కె.సదానందం, సుంకిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, అరుణ్ కుమార్, బిక్షమయ్యతో పాటు పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

స్వీట్లు తినిపించుకుంటూ ఆనందం వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు

ఎస్కీలో డేటా క్వాలిటీ అనలిస్ట్‌పై ప్రత్యేక శిక్షణ

సిటీబ్యూరో, ఆగస్ట్ 27(నమస్తే తెలంగాణ): ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ డేటా అనలిస్ట్‌పై ప్రత్యేక శిక్షణతో విద్యార్థులకు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజీ ఆఫ్ ఇండియా డైరెక్టర్ రామేశ్వర్ రావు అన్నారు. పీఎంకేవీవై 4.0 కార్యక్రమంలో భాగంగా స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సహకారంతో ఎమర్జింగ్ టెక్నాలజీలో విద్యార్థులకు వృత్తి నైపుణ్యాలను పెంపొందించేందుక కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో పుల్లారెడ్డి డిగ్రీ, పీజీ కళాశాలలో మంగళవారం జరిగిన ఆవిష్కరణ కార్యక్రమానికి కళాశాల సెక్రటరీ పి.సుబ్బారెడ్డి హాజరయ్యారు. టెక్నాలజీ రంగంలో వస్తున్న మార్పులను అందిపుచ్చుకోవాలని, ఆధునాతన సాంకేతికతలో నైపుణ్యాలతో ఉన్నత ఉద్యోగ, ఉపాధి అవకాశాలను పొందవచ్చని పలువురు వ్యాఖ్యానించారు. కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ డా. కె.మురళీ కృష్ణ, సాయి కిషోర్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అపోలో 36వ వార్షికోత్సవం

సిటీబ్యూరో, ఆగస్టు 27(నమస్తే తెలంగాణ): జూబ్లీహిల్స్ అపోలో ఆసుపత్రి 36వ వార్షికవేడుకలు ఆసుపత్రి ఆవరణలో మంగళవవారం ఘనంగా జరిగాయి. ముఖ్య అతిథిగా మేనేజింగ్ డైరెక్టర్ సంగీతా రెడ్డి, ఉపాసన కామినేని హాజరై ఈ కార్యక్రమానికి జ్యోతి ప్రజ్వలన చేశారు. కార్యక్రమంలో అపోలో ఈవో తేజస్వీరావు, సీఓఓ హరకరణ్ తదితరులు పాల్గొన్నారు.

మలబార్‌కు ఇండియా గోల్డ్ కాన్ఫరెన్స్ రెస్పాన్సిబులిటీ అవార్డు

సిటీబ్యూరో, ఆగస్టు 27(నమస్తే తెలంగాణ): ప్రపంచంలోని అతి పెద్ద ఆభరణాల వ్యాపార సంస్థల్లో ఒక్కటైన మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ 2023 – 24వ సంవత్సరానికి ప్రతిష్టాత్మకమైన 'ఇండియా గోల్డ్ కాన్ఫరెన్స్ రెస్పాన్సిబులిటీ' జువెల్లరీ హౌస్ అవార్డును అందుకుంది. బెంగళూరులోని హిల్టన్ మాన్యత బిజినెస్ పార్క్ హోటల్‌లో ఇండియా గోల్డ్ పాలసీ సెంటర్ చైర్‌పర్సన్ డా.సుందరవల్లి నారాయణ స్వామి నుంచి మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ ఇండియా ఆపరేషన్స్ మేనేజింగ్ డైరెక్టర్ ఓ.ఆషర్ అవార్డును అందుకున్నారు. కాగా, ఈ కార్యక్రమంలో బిజినెస్ డెవలప్‌మెంట్ హెడ్ సీతా రామన్, దిలీప్ నారాయణ్, సునీల్ కశ్యప్ హాజరయ్యారు.

ఆర్మీ ఉద్యోగి కుటుంబానికి రూ.కోటి పీఎన్‌బీ రక్షక్ బీమా

- కుటుంబ సభ్యులకు చెక్ అందజేసిన బ్యాంకు అధికారులు



సిటీబ్యూరో, ఆగస్టు 27(నమస్తే తెలంగాణ): పంజాబ్ నేషనల్ బ్యాంక్ వినియోగదారు అయిన ఇండియన్ ఆర్మీకి చెందిన షహీద్ సుబేదార్ కృష్ణారెడ్డి అకాల మరణంతో అతని కుటుంబ సభ్యులకు కోటి రూపాయల చెక్కును బ్యాంకు అధికారులు మంగళవారం అందజేశారు. నగరంలోని శేరిలింగంపల్లి బ్రాంచ్‌లో బ్యాంకు వినియోగదారునిగా షహీద్ సుబేదార్ కుమారుడు ఎం.కిరణ్ కాంత్‌కు పీఎన్‌బీ రక్షక్ ప్లస్ ఇన్సూరెన్స్ చెక్కును జోనల్ హెడ్ దీపక్ కుమార్ శ్రీవాస్తవ, డిప్యూటీ జోనల్ హెడ్ సంజయ్ మానే, సర్కిల్ హెడ్ అరవింద్‌లు అందజేశారు. ఈ సందర్భంగా జోనల్ హెడ్ దీపక్ కుమార్ శ్రీవాస్తవ మాట్లాడుతూ, సాయుధ బలగాల పరాక్రమాన్ని, త్యాగాన్ని గౌరవించేలా పంజాబ్ నేషనల్ బ్యాంకు ప్రత్యేక లక్షణాలతో కూడిన పథకాన్ని ప్రవేశ పెట్టిందని, దీనిని పీఎన్‌బీ రక్షక్ ప్లస్ యోజన అని పేరు పెట్టామని తెలిపారు. ఈ బీమా పథకం కింద సైనికులు, పెన్షనర్లు బ్యాంకు నుంచి బీమా పొందుతారని, ఈ బీమా రక్షణ సాయుధ దళాల కుటుంబానికి ఊహించని పరిస్థితుల నుంచి ఆర్థిక భద్రత కల్పిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో పీఎన్‌బీ అసిస్టెంట్ జనరల్ మేనేజర్లు రాజ్ కుమార్ సిన్హా, వాసుదేవ రావు, వెంకట్ కృష్ణన్, సీవీ రావు, జోనల్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ అధ్యాపకులకు పే స్కేల్ అమలు చేయండి

● జేఎన్టీయూహెచ్ కాంట్రాక్ట్ అధ్యాపకుల సంఘం నేతలు

కేపీహెచ్‌బీ కాలనీ, ఆగస్టు 27: విశ్వవిద్యాలయాలలో బోధిస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకులకు యూజీసీ పే స్కేల్ (బేసిక్ పే, డీఏ, హెచ్ఆర్‌తో కూడిన)ను వెంటనే అమలు చేయాలని జేఎన్‌టీయూహెచ్ వర్సిటీ కాంట్రాక్ట్ అధ్యాపకుల సంఘం నేతలు డిమాండ్ చేశారు. యూనివర్సిటీలో కాంట్రాక్ట్ అధ్యాపకుల సంఘం ఆధ్వర్యంలో యూనివర్సిటీ అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి యూనివర్సిటీలలో వీసీలను నియమిస్తామని, పలు యూనివర్సిటీలలో అనేక సంవత్సరాలుగా ఖాళీగా ఉన్న అధ్యాపక, అధ్యాపకేతర పోస్టులను భర్తీ చేస్తామని ప్రకటించడం సంతోషకరమన్నారు. కానీ, యూనివర్సిటీలలో ఏండ్ల తరబడి కాంట్రాక్ట్ అధ్యాపకుల సమస్యలను ప్రస్తావించకపోవడం బాధాకరమన్నారు. గత పాలకులు యూనివర్సిటీలను నిర్వీర్యం చేశారని ప్రకటించిన సీఎం, ప్రజా పాలనలో సమస్యలను వెంటనే పరిష్కరిస్తామని చెప్పారన్నారు. కానీ, యూనివర్సిటీలలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకులకు యూజీసీ పే స్కేల్‌ను అమలు చేయాలని కోరితే, ఇప్పటి వరకు స్పందించలేదన్నారు. విశ్వవిద్యాలయాలలో బోధనతో పాటు విభాగ అధిపతులుగా, హాస్టల్ వార్డెన్‌గా, ప్లేస్మెంట్ అధికారులుగా, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ పోగ్రాం ఆఫీసర్లుగా, కళాశాల ప్రిన్సిపాళ్లుగా పలు బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తున్న వారికి వెంటనే న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. యూనివర్సిటీలలో కాంట్రాక్ట్ అధ్యాపకులు చాలీచాలని జీతాలతో పనిచేస్తున్నారని, ఉమ్మడి రాష్ట్రం నుంచి పనిచేస్తున్నా, నేటికీ సమస్యలకు పరిష్కారం కాలేదన్నారు. కాంట్రాక్ట్ అధ్యాపకులను గత ప్రభుత్వం రెగ్యూలరైజేషన్ చేస్తామని నమ్మించి మోసం చేసిందని, సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం న్యాయం చేస్తుందని భావిస్తున్నట్లు తెలిపారు. కాంట్రాక్ట్ అధ్యాపకులకు యూజీసీ పే స్కేల్‌ను అమలు చేసి, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. కాంట్రాక్ట్ అధ్యాపకులను రెగ్యూలరైజ్ చేసిన తర్వాత మిగిలిన పోస్టులను భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో పలువురు వర్సిటీ కాంట్రాక్ట్ అధ్యాపకులు సురేశ్ నాయక్, శివారెడ్డి, వంశీకృష్ణారెడ్డి, శివకుమార్, దశరథం, నవీన్‌కుమార్, మాథ్యూస్, సిద్ధార్థ్ పాల్గొన్నారు.



వర్సిటీ కాంట్రాక్ట్ అధ్యాపకులకు యూజీసీ పే స్కేల్‌ను అమలు చేయాలని నిరసన తెలుపుతున్న కాంట్రాక్ట్ అధ్యాపకుల సంఘం నేతలు

కేంద్రప్రభుత్వ పెన్షన్ స్కీంపై తీవ్ర వ్యతిరేకత

అబిడ్స్, ఆగస్టు 27: కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఏకీకృత పెన్షన్ స్కీంపై జీహెచ్ఎంసీ ఉద్యోగులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని మున్సిపల్ సహకార్ ముజ్దూర్ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఆదిల్ షరీఫ్ పేర్కొన్నారు. జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయం ఆవరణలో ఉద్యోగులు, కార్మికులతో కలిసి నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం, ఆయన మాట్లాడుతూ పాత పెన్షన్ స్కీమ్‌ను పునరుద్ధరించాలని ఉద్యోగులు తమ దీర్ఘకాల డిమాండ్‌ను పునరుద్ఘాటించారు. ప్రభుత్వ ఉద్యోగులు తమ జీవితంలో కొంత భాగాన్ని పెన్షన్ నిధులకు జమ చేయాలని కొత్త పెన్షన్ విధానాన్ని అంగీకరించబోమని స్పష్టం చేశారు. ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జి.శ్రీనివాస్, ఎం.రామకృష్ణ, కె.రమేష్, కె.శివ కుమార్, ఎం.మోసెస్, ఏవీఎస్ గాంధీ, ఎల్.మెర్సీ, కొండారి రాజు, మల్లికార్జున్ పాల్గొన్నారు.

ఓవైసీ బ్రదర్స్ కళాశాలపై చర్యలు తీసుకోవాలి

ఆర్కేపురం, ఆగస్టు 27: సల్కమ్ చెరువులో ఉన్న ఓవైసీ బ్రదర్స్ కళాశాలపై చర్యలు తీసుకోవాలని సరూర్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి అంజన్ హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను కోరారు. దీనికి సంబంధించి శ్రీవాణి హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను మంగళవారం కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పేద మధ్యతరగతి కుటుంబాలకు అన్యాయం చేయొద్దని, హైడ్రా ఒక హైడ్రామా కాదు అని అంటే సల్కమ్ చెరువులో ఉన్న ఓవైసీ బ్రదర్స్ కళాశాలపై చర్యలు తీసుకోవాలని హైడ్రా కమిషనర్‌ను కోరినట్లు కార్పొరేటర్ తెలిపారు. ఎఫ్‌టీఎల్ ఫరిధిలో నిర్మాణాలు చేపట్టిన వారు ఏ పార్టీకి చెందిన వారైనా పార్టీలకు అతీతంగా కూల్చివేయాలని పేర్కొన్నారు.

సల్కమ్ చెరువులో ఓవైసీ బ్రదర్స్ కళాశాలపై చర్యలు తీసుకోవాలని రంగనాథ్‌కు వినతి పత్రం అందజేస్తున్న శ్రీవాణి

అంధత్వ నిర్మూలనకు నేత్రదానం చేద్దాం

● రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ హెల్త్ డాక్టర్ రవీంద్ర నాయక్ ● పుష్పగిరి ఐ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జాతీయ నేత్రదాన పక్షోత్సవాలు షురూ..

సుల్తాన్‌బజార్, ఆగస్టు 27: సమాజం నుంచి అంధత్వాన్ని పారద్రోలేందుకు ప్రతి ఒక్కరు స్వచ్ఛందంగా నేత్ర దానం చేసేందుకు ముందుకు రావాలని రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ హెల్త్ డాక్టర్ రవీంద్ర నాయక్ అన్నారు. కోఠి డీఎంహెచ్ఎస్ క్యాంపస్ ఆవరణలోని సీఎఫ్ డబ్ల్యూ, ఎన్‌హెచ్ఎం ప్రధాన కార్యాలయం ఆవరణలో జాతీయ అంధత్వ నివారణ కార్యక్రమం, పుష్పగిరి నేత్ర ఫౌండేషన్ల సంయుక్త ఆధ్వర్యంలో ఆగస్టు 25 నుంచి సెప్టెంబర్ 8 వరకు నిర్వహిస్తున్న జాతీయ నేత్ర దాన పక్షోత్సవాలను నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన ఫౌండేషన్ చైర్మన్ గోవింద హరి, ఎన్పీసీబీ జేడీ డాక్టర్ బి.మోతిలాల్ నాయక్, పారా మెడికల్ ఆప్తాల్మిక్ ఆఫీసర్ శివ శంకర్, ఫౌండేషన్ ప్రిన్సిపాల్ డాక్టర్ విజయ కిరణ్‌లతో మంగళవారం కలిసి జెండా ఊపి మొబైల్ క్లినిక్ వాహనాన్ని ప్రారంభించారు. అనంతరం అందరితో ఆయన ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దేశంలో 11 లక్షల మంది అంధత్వం కోల్పోయి ఇబ్బంది పడుతున్నారని అన్నారు. సంవత్సరానికి 25 వేల మంది కనుచూపును కోల్పోతున్నారని, ఇందులో 45 శాతం చిన్నారులే ఉంటడం గమనార్హమని అన్నారు. అత్యధికంగా చిన్నారులు ప్రమాదాల బారినపడి కంటి చూపును పోగొట్టుకుంటున్నారని అన్నారు. ఎన్పీసీబీ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ బి.మోతిలాల్ నాయక్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో 5వ తరగతి నుంచి పదో తరగతి చదువుతున్న విద్యార్థులందరికి కంటి స్క్రీనింగ్ పరీక్షలను నిర్వహిస్తున్నామని అన్నారు. సుమారు 20 లక్షల మంది విద్యార్థులకు కంటి పరీక్షలను నిర్వహించి అవసరమైన వారికి కంటి అద్దాలను అందిస్తున్నట్లు తెలిపారు. నేత్ర సమస్యలను పారద్రోలేందుకు రాష్ట్ర వ్యాప్తంగా 50 కార్నియల్, ట్రాన్స్‌ప్లాంటేషన్ సెంటర్ లు ఉన్నాయని అన్నారు. అంతే కాకుండా చిరంజీవి ఐ బ్యాంక్, వాసన్ ఐ బ్యాంక్, రామాయమ్మ ఐ బ్యాంక్, మాధవ్ నేత్ర నిధి(పుష్పగిరి ఐ ఇన్స్టిట్యూషన్), టీఎల్ కపాడియా ఐ బ్యాంక్ (సరోజిని దేవి ఐ హాస్పి టల్)లు నగరంలో అందుబాటులో ఉన్నాయని అన్నారు. అనంతరం, పుష్పగిరి ఐ ఫౌండేషన్ చైర్మన్ గోవింద హరి మాట్లాడారు.

జాతీయ నేత్రదాన పక్షోత్సవాలను జెండా ఊపి ప్రారంభిస్తున్న డైరెక్టర్ ఆఫ్ హెల్త్ డాక్టర్ రవీంద్ర నాయక్, పుష్పగిరి ఐ ఫౌండేషన్ చైర్మన్ గోవింద హరి, జాయింట్ డైరెక్టర్ డాక్టర్ బి.మోతిలాల్ నాయక్‌లు

నగరంలో అంతర్జాతీయ స్టార్టప్ ఫెస్టివల్

- సెప్టెంబర్ 26 నుంచి 28 తేదీల్లో నిర్వహణ

అంతర్జాతీయ స్టార్టప్ ఫెస్టివల్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఇండియన్ స్టార్టప్ ఫౌండేషన్ ప్రతినిధి జేపీ చౌదరి తదితరులు

సిటీబ్యూరో, ఆగస్టు 27(నమస్తే తెలంగాణ): నగరంలో అంతర్జాతీయ స్టార్టప్ ఫెస్టివల్‌ను సెప్టెంబర్ 26 నుంచి 28 తేదీల్లో నిర్వహిస్తున్నామని ఇండియన్ స్టార్టప్ ఫౌండేషన్ ప్రతినిధి జేపీ చౌదరి తెలిపారు. టీ హబ్‌లో ఇన్వెస్టర్ కనెక్ట్ వర్క్‌షాప్‌ను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జేపీ చౌదరి మాట్లాడుతూ, కొత్త ఆలోచనలతో ప్రారంభించే స్టార్టప్ కంపెనీలను ప్రోత్సహించేందుకు, అందులో పెట్టుబడులు పెట్టేందుకు పలువురు పెట్టుబడిదారులు ఎంతో ఆసక్తితో ఉన్నారన్నారు. స్టార్టప్ సంస్కృతి మరింత విస్తృతం చేసేందుకు గ్లోబల్ ఇంక్యుబేషన్ సిటీ, ఇంటర్నేషనల్ స్టార్టప్ నెట్‌వర్క్ ప్రైవేట్ లిమిటెడ్‌తో కలిసి సెప్టెంబర్ 26 నుంచి 28 వరకు అంతర్జాతీయ స్టార్టప్ ఫెస్టివల్‌ను గచ్చిబౌలిలోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియాలో నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ ఏడాది నగరంలో మొదటి సారిగా ఇంటర్నేషనల్ స్టార్టప్ ఫెస్టివల్‌ని నిర్వహించి, స్టార్టప్‌లకు ప్రపంచ వ్యాప్తంగా విస్తరించేందుకు ఉన్న అవకాశాలను తెలియజేస్తామన్నారు. ఈ సందర్భంగా అంకుర పేరుతో అంతర్జాతీయ స్టార్టప్ ఫెస్టివల్ పోస్టర్ ఆవిష్కరించారు.

బీసీలకు 42% రిజర్వేషన్లు అమలు చేయాలి

దుండిగల్‌లో చేపట్టిన దీక్షకు సంఘీభావం తెలిపిన ఆర్.క్రిష్ణయ్య తదితరులు

దుండిగల్, ఆగస్టు 27: కాంగ్రెస్ పార్టీ కామారెడ్డిలో ప్రకటించిన బీసీ డిక్లరేషన్‌కు కట్టుబడి వెంటనే బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను అమలు చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్.క్రిష్ణయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బీసీల ఆమరణ దీక్షలో భాగంగా గత మూడు రోజుల నుంచి నగరంలోని హైదర్‌గూడ, ఎల్బీనగర్‌లో పూర్తి కాగా, మూడో రోజు దుండిగల్‌లో చర్చ్ గాగిళ్లాపూర్‌లో హిందూ బీసీ మహాసభ అధ్యక్షులు బత్తుల సిద్దేశ్వర్ పటేల్, బీసీ ఆజాద్ యూత్ ఫెడరేషన్ సంజయ్ కుమార్‌లు ఈమరణ నిరాహార దీక్షను ఆర్.క్రిష్ణయ్య సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక బీసీ డిక్లరేషన్‌ను ప్రకటిస్తుందని చెప్పి గద్దెనెక్కిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇంకా దానిని అమలు చేసే యోచనలో తాత్సారం చేయడం ఏమిటని ప్రశ్నించారు. బీసీ డిక్లరేషన్‌ను అమలు చేసేంత వరకు తమ పోరాటం ఆపబోమని హెచ్చరించారు. ఈ దీక్షలో బీసీ జనసభ అధ్యక్షులు రాజారాం యాదవ్, సోషల్ జస్టిస్ పార్టీ అధ్యక్షులు చామకూర రాజు, కేవీ గౌడ్, రాయబండి పాండు రంగాచారి, కోట్ల వాసుదేవ్ పటేల్, దేశం మహేశ్ గౌడ్, దుబ్బకోటి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

హరే కృష్ణ స్వర్ణ దేవాలయంలో ఘనంగా వ్యాస పూజ

స్వామి వారి కోసం సిద్ధం చేసిన 1008 రకాల నైవేద్యాలు

ఖైరతాబాద్, ఆగస్టు 27: బంజారాహిల్స్ ఎన్బీటీనగర్‌లోని హరే కృష్ణ స్వర్ణ దేవాలయంలో మంగళవారం సందోత్సవం, అంతర్జాతీయ హరే కృష్ణ మూవ్‌మెంట్ (ఇస్కాన్) వ్యవస్థాపకులు శ్రీల ప్రభుపాదుల 128 జయంతి సందర్భంగా మంగళవారం వ్యాస పూజ ఉత్సవాలు ఘనంగా జరిగాయి. సందోత్సవంలో భాగంగా గోదా కృష్ణాభిషేకం, శ్రీకృష్ణుడి సంకీర్తన, సేవ, రాజ్‌భోగ్, హారతి నిర్వహించారు. అనంతరం, హరే కృష్ణమూవ్‌మెంట్ హైదరాబాద్ అధ్యక్షులు సత్యగౌర చంద్రదాస నేతృత్వంలో శ్రీకృష్ణ, శ్రీల ప్రభుపాదలకు భక్తులు తయారు చేసిన 1008 రకాల ప్రత్యేక నైవేద్యాలను సమర్పించారు. అలాగే, వ్యాస పూజ 2024 పుస్తకాన్ని ఆవిష్కరించారు.


వ్యాస పూజ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సత్యగౌర చంద్రదాస